క్లుప్తంగా

మోడల్‌స్కూల్ వార్షికోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ వాణికుమారి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్ వార్షికోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాణి కుమారి, ఎంఈఓ పుష్పవేణి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, జీవన్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపునకు చర్యలు


ఇళ్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేందుకు తెచ్చిన స్తంభాలు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ గురించి సాక్షి దినపత్రికలో ఈ నెల 1న ప్రాణం పోయిన స్పందించరా..? అనే కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత విద్యుత్ సిబ్బంది స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. నివాసగృహాల వద్ద ప్రమాదంగా ఉన్న వైర్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి ఏఈ సాయిరాం తెలిపారు. ఇండ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి మారోచోట ఏర్పాటు చేసేందుకు అవసరం ఉన్న స్తంభాలను శుక్రవారం గ్రామానికి పంపిస్తామని చెప్పారు.

చెక్కుల పంపిణీ


నర్సాపూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పట్టణంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి పంపిణీ చేశారు. శివ్వంపేట మండలం భీమ్లా తండాకు చెందిన శ్రీకాంత్, పాంబండకు చెందిన రమేశ్‌నాయక్, గూడూరుకు చెందిన సంధ్య, నర్సాపూర్ మండలం మూసాపేటకు చెందిన అన్నం లక్ష్మి, శశికళ, ఎల్లారెడ్డిగూడెంకు చెందిన పి.లక్ష్మిలకు ఆమె చెక్కులు అందజేశారు. ఆమె వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేటలో జరుగుతున్న నల్ల పోచమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆశోక్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


రోడ్డుపనులు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రంగాయపల్లి, జీడిపల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.9లక్షల చొప్పున నిధులతో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీల పనుల కోసం భూమిపూజలు చేసి ప్రారంభించారు. వీరి వెంట రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అశోక్, గణేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మందికి గురుకుల సీట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మనంతయపల్లితండా ప్రాథమిక పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులకు గురుకుల పాఠశాలలో సీట్లు వచ్చినట్లు హెచ్ఎం స్రవంతి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులందరికీ సీట్లు వచ్చేలా సన్నద్ధం చేసిన హెచ్ఎం, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నిలిచిన హైవే పనులు

- 8 నెలలు కావస్తున్నా.. పూర్తికాని వైనం
- ఇబ్బందుల్లో ప్రజలు
- నిర్లక్ష్యంగా అధికారులు


కంకరవేసి నిలిపివేసిన హైవే రోడ్డు నిర్మాణ పనులు

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు నిర్మాణ పనుల్లో అధికారుల సమన్వయం లోపంతో మండల కేంద్రంలో కంకరవేసి రోడ్డు పనులు నిలిపివేశారు. ఈ పనులు ప్రారంభించి దాదాపు 8నెలలు కావస్తున్నా.. ఇంకా పూర్తిగాకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ప్రజల అవసరాలరీత్యా పనులను చేసి రోడ్డు రవాణా సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా దుకాణ యజమానులు, వాహనాదారులు నానా అవస్థలు పడుతున్నారు.

అధికారుల్లో సమన్వయ లోపం..

మెదక్– ఎల్లారెడ్డి వరకు కొనసాగుతున్న హైవే రోడ్డు నిర్మాణ పనులను నిర్వహిస్తున్నారు. ఈ పనులు ప్రారంభించి 8 నెలలు కావస్తున్నా.. మండల కేంద్రంలో మాత్రం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ రోడ్డు నిర్మాణంలో విద్యుత్‌శాఖ అధికారులు స్తంభాలను పాత వాటిని తొలగించి కొత్తగా ఏర్పాటు చేసిన వాటిని కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా పనులు నిలిపివేయడంతో మురుగునీరు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.


డ్రైనేజీ కోసం తవ్వి వదిలివేయడంతో నిలిచిన మురుగునీరు

దుర్వాసన వస్తోంది



హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఇంటి ఎదుట డ్రైనేజీ కోసం తీసిన గుంతలను తీసి, అలాగే వదిలిలేశారు. దీంతో ఇంటి ముందు మురుగునీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. ఇలాగే ఉంటే తాము అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నందున అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి ఆరోగ్యాలు కాపాడాలి.

– మహ్మద్ చాంద్‌పాషా, హవేళిఘణాపూర్

అవస్థలు పడుతున్నాం



అధికారులు హైవే నిర్మాణం కోసం మా దుకాణం ఎదుట పెద్ద గుంతను తీసి అలాగే వదిలివేశారు. దాంతో దుకాణంలోకి వచ్చి వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. రోడ్డును కంకరవేసి వదిలివేయడం ద్వారా వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ముధూళితో అనేక అవస్థలు పడుతున్నాం. త్వరగా పనులు పూర్తి చేయాలి.

– కృష్ణమాచారి, గోల్డ్‌షాపు యజమాని

కల్యాణోత్సవానికి ఆలయాలు ముస్తాబు


శివ్వంపేటలో కోదండరామిస్వామి ఆలయం


చాకరిమెట్లలో కొలువైన సీతారామచంద్రస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): శ్రీరామనవమి సందర్భంగా సీతారామస్వామి కల్యాణోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రం శివ్వంపేటలోని వందల ఏళ్లనాటి కోదండరామస్వామి ఆలయంతో పాటు చాకరిమెట్లలో కొలువైన సీతారామచంద్రస్వామి ఆలయాలకు రంగులు వేయడంతో విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. వివిధ గ్రామాల్లో కల్యాణోత్సవ వేడుకలు జరగనున్నాయి. చాకరిమెట్లలో ఆదివారం ఉదయం కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు.

మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన పురాతన కోదండరామస్వామి జాతర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు గ్రామ అర్చకుడు, వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ తెలిపారు. ఏటా శ్రీరామనవమి రోజున కోదండరామస్వామి కల్యాణం అనంతరం 6 రోజుల పాటు వివిధ రూపాల్లో పల్లకీసేవ ఊరేగింపు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించి శనివారం రథోత్సవ వేడుకలు జరగనున్నాయి.

కొనసాగుతున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర


కమలాపూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ భారత రాజ్యాంగ యాత్రను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం కమలాపూర్, ఆరేపల్లి, చీలాపల్లి గ్రామాల మీదుగా నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, రాజేందర్‌గౌడ్, కుంట్ల రాములు, శ్రీను,జైపాల్‌గౌడ్ తదితరులున్నారు.

అందరికీ సమానహక్కులు

చిన్నశంకరంపేట(మెదక్): అందరికి సమానహక్కుల కోసం కాంగ్రెస్ పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి పాదయాత్రగా జై బాపు–జై బీమ్–జై సంవిధాన్ అభియాన్ నిర్వహించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, సీపీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు, కాంగ్రెస్ నాయకులు అరుణ, రాజిరెడ్డి, కృష్ణాగౌడ్, రాజేశ్, నర్సింలుగౌడ్, లక్ష్మీనర్సింలు, బాలాజీ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆన్‌లైన్ సౌకర్యం ఏర్పాటు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాజీవ్ యువ వికాస్ పథకానికి ఎంపీడీఓ కార్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్ చేసుకోవడానికి సౌకర్యం కల్పించామని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ యువ వికాస్‌కు దరఖాస్తున్న వారు తప్పనిసరిగా మూడు జిరాక్స్ సెట్లు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 14 చివరి తేదీ అన్నారు. ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు నిర్వహించాలని, పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, ఏపీఓ శ్యామ్, ఈసీ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: తైక్వాండో ప్రమోషన్ టెస్ట్‌లో సిద్ధార్థ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శుక్రవారం మెదక్ మండలం మాచవరం గ్రామంలోని శ్రీరాజేశ్వరీ గార్డెన్స్‌లో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ వారు తైక్వాండో ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో సిద్ధార్థ్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. టెస్ట్ అనంతరం విద్యార్థులకు బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ సభ్యులు ప్రదీప్‌కుమార్, సురేష్, తైక్వాండో మాస్టర్ కృష్ణ, సిద్ధార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కలప తరలిస్తున్న డీసీఎం స్వాధీనం

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్న డీసీఎంను అటవీ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామ శివారులో అనుమతులు లేకుండా చెట్లను నరికివేసి డీసీఎంలో తరలిస్తుండగా, అటవీ సిబ్బంది పట్టుకొని కార్యాలయానికి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికి, తరలిస్తున్న వారికి జరిమానా విధిస్తామని బీట్ అధికారి భరత్ అన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు

పాపన్నపేట(మెదక్): మండలంలోని కొడుపాకలో పోచమ్మ దేవాలయంలో శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మూడో వార్షికోత్సవాల్లో భాగంగా ఆయనపాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, భూమన్న, సతీష్, మోహన్ పాల్గొన్నారు.

మండల పరిధిలోని కొడుపాకలో జరిగిన పోచమ్మ దేవాలయ వార్షికోత్సవంలో మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సంగప్ప, గురుమూర్తిగౌడ్, లింగారెడ్డి, కిష్టయ్య, రాజయ్య, నవీన్‌గౌడ్, మల్లేశం, మాజీ ఎంపీటీసీ రాములుచారి, నాయకులు కాశీనాథ్ రావు, వెంకటేశం, భూషణం తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కొల్చారం(నర్సాపూర్): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రంగంపేటలో చౌక ధరల దుకాణంలో రాజిరెడ్డి సన్నబియ్యం పంపిణీ చేశారు. మేనిఫెస్టోలో ప్రభుత్వం డీలర్లకు ఇస్తామన్న గౌరవించడం రూ.5వేలు కమిషన్ కింద క్వింటాలుకు రూ.300లు అందజేయాలని రాజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ సంఘం మండలాధ్యక్షుడు ప్రభాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, గ్రామాధ్యక్షుడు కృష్ణ, రేషన్ డీలర్లు శ్రీనివాస్, నగేష్, బాల్‌రాజు, రామచందర్‌రెడ్డి, వెంకటరమణ, పాపాగౌడ్, లక్ష్మణ్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రామాయంపేట(మెదక్): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యక్షేత్రం వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. నిర్వాహకులు కోటి సత్యనారాయణ ప్రారంభించగా, డిపో మేనేజర్ సురేఖ, ఆర్టీసీ కంట్రోలర్ ప్రసాద్, బాదె గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తాలో చలివేంద్రాన్ని ఎంపీడీఓ విఠల్ ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అన్ని గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో కార్యదర్శి మౌనిక, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సన్నబియ్యం.. పేదలకు వరం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్


శేరిపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): దేశంలో పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో దొడ్డుబియ్యం అందించిన ప్రభుత్వం కనీసం ప్రమాణాలు కూడా పట్టించుకోలేదని, సగం నూకలు, రాళ్లతో కూడిన బియ్యం అందించారన్నారు. శేరిపల్లి గ్రామానికి రూ.2 కోట్లతో మిర్జాపల్లి వరకు బీటీ రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ కరీం, ఎంపీడీఓ ఆనంద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుప్రభాత్‌రావు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, కాంగ్రెస్ నాయకులు అరుణ, రాజిరెడ్డి, కృష్ణాగౌడ్, లక్ష్మీనర్సింలు, నర్సింలుగౌడ్, బాలాజీ, భరత్, నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు రాజేశ్, సత్యనారాయణ, రాజాసింగ్, కేశవులు పాల్గొన్నారు.

ధరిపల్లిలో..

మండలంలోని ధరిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నవీన్‌కుమార్ సన్నబియ్యం పంపిణీ చేశారు. సూరారంలో కాంగ్రెస్ నాయకులు రాజ్‌కుమార్‌గౌడ్, అక్బరొద్దీన్ ప్రారంభించారు.

పేదల కుటుంబాల్లో ఆనందం

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం పేదల కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో సన్నబియ్యం పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు, నాయకులు నారాగౌడ్, ఆర్‌ఎస్.సంతోష్, సత్యనారాయణ, గంగారెడ్డి, రాజన్‌గౌడ్, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్, పెరుమాండ్లగౌడ్, కుంట్ల శ్రీను, సాయిరెడ్డి, శశిధర్‌రెడ్డి తదితరులున్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పర్యటించి జై బాపు, జైసంవిధాన్‌లో భాగంగా మండలంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం, ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, కాంగ్రెస్ నాయకులు అమరసేన రెడ్డి, పంజా మహేందర్, నసీరుద్దీన్, లింగంగౌడ్, అజయ్, దేశెట్టి సిద్ధరాములు, సామల మహేశ్, వెంకటేశ్ గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బర్దిపూర్‌లో..

టేక్మాల్(మెదక్): మండలంలోని బర్దిపూర్‌లో సన్న బియ్యం పంపిణీని మండల మాజీ వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి గోపి, రేషన్ డీలర్ సంతోష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగమేశ్వర్, నాయకులు పెంటయ్య, రవికుమార్, మహేందర్, శంకరయ్య, విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళాలు


రామాలయ నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో పురాతన రామాలయం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి విరాళాల సేకరణ కొనసాగుతోంది. శుక్రవారం ఆయా కాలనీల్లో అన్ని వర్గాల వారు తమ వంతు సహాయంగా విరాళాలను అందజేశారు. ఈ నెల 21 నుంచి 23 వరకు నూతన ఆలయంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ ఇంటికి ఆలయ కమిటీ బృందం ఆహ్వాన పత్రిక అందజేస్తూ విరాళాలను సేకరిస్తున్నారు. ప్రతీ ఒక్కరూ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు జంగం శ్రీనివాస్, మురళిపంతులు, ఆర్‌ఎస్.సంతోష్, సత్యనారాయణ, కందుకూరి రవీందర్, గంగారెడ్డి, రాగం సిద్ధు, రాగం శ్రీను, సుభాష్‌గౌడ్, విఠల్‌రెడ్డి, సీతారం, గుజ్జరి అనిల్, సర్వేశ్వర్, సతీష్‌గౌడ్, లక్ష్మణ్, సాయిలు, సంతోష్ తదితరులున్నారు.

ఆలయాలు సన్మార్గానికి నిలయాలు

మాధవానంద సరస్వతీస్వామి

కౌడిపల్లి(నర్సాపూర్): ఆలయాలు సన్మార్గానికి నిలయాలు అని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయిలాపూర్‌లో గ్రామస్తుల విజ్ఞాప్తి మేరకు సీతారామాలయం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయానికి వెలితే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితుడు ఉమాశంకరశర్మ, మాజీ సర్పంచ్ శేఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


రాయిలాపూర్‌లో సీతారామ ఆలయానికి స్థలాన్ని పరిశీలిస్తున్న మాధవానంద సరస్వతిస్వామి

బియ్యం పంపిణీలో ప్రొటోకాల్ పాటించలేదు


వెల్దుర్తి తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీలో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించలేదని బీజేపీ మండలాధ్యక్షుడు పడిగే దాసు అన్నారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజల రేషన్ కోసం నిధులు వెచ్చిస్తే, కాంగ్రెస్ నాయకులు తామే ఇస్తున్నామని ఎలాంటి ప్రొటోకాల్ లేకుండా రేషన్‌బియ్యాన్ని ప్రారంభించారని అన్నారు. వీరి వెంట జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశం, మాజీ ఎంపీటీసీ శివరాములు, మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్, మండల ఉపాధ్యక్షులు బాలకృష్ణ, నాగరాజు, విక్రమ్‌సింగ్, యాదగిరి, గణేశ్, హరీశ్ తదితరులున్నారు.

మనంతయపల్లిలో నర్సరీ తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మనంతయపల్లి తండాలో శుక్రవారం ఎంపీఓ కలీముల్లా వననర్సరీని తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవం నాటికి మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. పంచాయతీ రికార్డులు సక్రమంగా ఉంచాలని, ప్రజలకు సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ కలీముల్లా

సదస్సులతో విద్యార్థులకు మేలు


సదస్సులో పాల్గొన్న కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: జాతీయ స్థాయి సదస్సులతో విద్యార్థులకు మేలు జరుగుతుందని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ అన్నారు. గురువారం నుంచి కాలేజీలో జరిగిన 24గంటల జాతీయ స్థాయి హాక్ ఫినిటీ 2025 హ్యాకథాన్ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులతో విద్యార్థుల ఆలోచన ధోరణి పెరుగుతుందని, అవకాశాలు వస్తాయన్నారు. సదస్సులో వీఎస్‌ఆర్ కాలేజీ విద్యార్థులు ప్రథమస్థానం,మల్లారెడ్డి యూనివర్శిటీ విద్యార్థులు ద్వితీయ స్థానం, కేఎంఐటీ కాలేజీ విద్యార్థులు తృతీయ స్థానం దక్కించుకున్నవారికి నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందచేశారు. బీవీ రాజు కాలేజీ విద్యార్థులు కన్సోలేషన్ విభాగంలో నిలిచారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, ఏఐడీఎస్ హెచ్ఓడీ దశరథరామయ్య, కోఆర్డినేటర్ అమరేందర్‌రెడ్డి, స్టూడెంట్ కోఆర్డినేటర్ సాయికిరణ్, మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.